## ఘనంగా గురు వందన కార్యక్రమం




ముఖ్యవక్త కసిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, ఆగస్టు 18 : జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం తపస్ ఆధ్వర్యంలో గురువందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు. మనకు విద్యను నేర్పిన ప్రతి గురువును సన్మానించుకోవాలని అన్నారు. అనంతరం జిల్లాలోని 25 మందికిపైగా ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రముఖ వక్త కసిరెడ్డి వెంకట్‌రెడ్డిని శాలువా, మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో తపస్ నాయకులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఇన్‌చార్జి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్

కామారెడ్డి, ఆగస్టు 18 : పట్టణంలోని బాలుర వసతి గృహాన్ని ఇన్‌చార్జి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ ఆదివారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిసరాలు, రికార్డులు, వసతి గృహంలో ఉన్న కూరగాయలు, సరుకులను పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమ అధికారి పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, ఆగస్టు 18 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకొని ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

# పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



కామారెడ్డిలోని సిరిసిల్ల రోడ్డులో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

కామారెడ్డి/బీబీపేట్/నస్రుల్లాబాద్/రాజంపేట్/ఎల్లారెడ్డి/గాంధారి/నాగిరెడ్డిపేట/లింగంపేట /బాన్సువాడ, ఆగస్టు 18 : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రాజయ్య, ప్రతినిధులు శివరాములు, రాజయ్య, మల్లయ్య, దశాగౌడ్, బాలార్జున్‌గౌడ్, రవితేజాగౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి పట్టణం సిరిసిల్ల రోడ్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పూలమాల వేసి నివాళులర్పించారు. నస్రుల్లాబాద్‌లో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వా యి పాపన్న జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు మైశాగౌడ్, సాయాగౌడ్, దస్తాగౌడ్, విజయ్ కుమార్ గౌడ్, వామన్‌గౌడ్, శ్రావణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీబీపేట్‌తోపాటు మాందాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, తుజాల్‌పూర్, రాజంపేట్, కొండాపూర్, తలమడ్ల, గుండారం, ఎల్లారెడ్డిపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు.

గాంధారిలో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బి.నారాగౌడ్, సాయాగౌడ్, అంజాగౌడ్, వెంకటిగౌడ్, రవి గౌడ్, ప్రవీణ్‌గౌడ్, నారాగౌడ్, బాలాకృష్ణాగౌడ్, శ్రీకాంత్ గౌడ్, బాలరాజ్‌గౌడ్, వెంకాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలో నిర్వహిం చిన కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌గౌడ్‌తో పాటు మాజీ జడ్పీటీసీ ఉషా గౌడ్, నాయకులు బాలకిషన్ గౌడ్, శ్యామ్ గౌడ్, ప్రసాద్ గౌడ్, సురేందర్ గౌడ్, కిషన్ గౌడ్, వేణు గౌడ్, రవి గౌడ్, లింగం గౌడ్, జీవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేటలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కలాలి యాదగిరి గౌడ్, ఉపాధ్యక్షులు రామాగౌడ్, లచ్చాగౌడ్, కార్యదర్శి వంశీగౌడ్, నాయకులు నారాగౌడ్, సంతోష్‌గౌడ్, మశేందర్‌గౌడ్, సాయాగౌడ్, మహేందర్‌గౌ డ్, బాలాగౌడ్, సురేందర్‌గౌడ్, సుభాష్‌గౌడ్, లింగంగౌడ్, దుర్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ సంఘం ప్రతినిధులు శంకర్‌గౌడ్, నారాగౌడ్, రవీందర్‌గౌడ్, సిద్ధాగౌడ్, ఎల్లమయ్య, రాజు, భైరయ్య, గులం, రషీద్, అర్షాద్‌పాషా, రాజేశ్వర్‌గౌడ్, ఫతీయుద్దీన్, ఖయ్యూం, సాజిద్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాప న్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాన్సు వాడలోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నాగం సాయిలు, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి హన్మాండ్లు, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు తుప్తి ప్రసాద్, బీర్కూర్ మండల అధ్యక్షుడు సాయికిరణ్, ఓబీజీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, పట్టణ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోనాల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో ..



ఎల్లారెడ్డిలో..



నాగిరెడ్డిపేట్‌లో..

## ఘనంగా తీజ్

కామారెడ్డి, ఆగస్టు 18 : జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం తీజ్‌ను ఘనంగా నిర్వహించారు. పెండ్లికాని యువతులు గోధుమ విత్తనాల మొలకలను ఎత్తుకొని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారాల్లో ముఖ్యమైన పండుగ తీజ్ అన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## నేడు స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్, ఆగస్టు 18 : బాన్సువాడ మండలంలోని కోనాపూర్– హన్మాజీపేట్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు గిరిజన విద్యార్థులతో స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్‌సీవో గంగారాం నాయక్, ప్రిన్సిపాల్ శ్యామలాదేవి ఆదివారం తెలిపారు. 2024–25 ఇంటర్ విభాగంలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో, 5, 7వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న గిరిజన విద్యార్థులు సోమవారం ఉదయం 10 గంటలకు దుర్కి వద్ద ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

## సుభాష్ చంద్రబోస్ వర్ధంతి



బీర్కూర్‌లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నస్రుల్లాబాద్, ఆగస్టు 18 : బీర్కూర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు పాల్వంచ బంద్

మాచారెడ్డి, ఆగస్టు 18 : కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన హత్యాచారం, బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం పాల్వంచ మండలంలో బంద్ నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు.

## రుణమాఫీ అందరికీ అందేలా చూస్తాం

కామారెడ్డి, ఆగస్టు 18 : రుణమాఫీ అందరికీ అందేలా చూస్తామని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ సన్మాన సభకులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రుణమాఫీ కొందరికి చిన్న చిన్న పొరపాట్లతో అందలేదని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

# మథుర లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి





గాంధారిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, ర్యాలీ నిర్వహిస్తున్న మథుర లంబాడీలు

**గాంధారిలో లబాన్ సమాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

గాంధారి, ఆగస్టు 18: తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ లబాన్ సమాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మథుర లంబాడీలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో లబాన్ సమాజ్ నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి లక్ష్మమ్మ ఆలయం వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా లబాన్ సమాజ్ నాయకులు మాట్లాడుతూ.. మథుర లంబాడీలను (కాయితీ)జీవో నంబర్ 245 ప్రకారం ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. దీంతోపాటు మథుర లంబాడీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పోడు భూములకు పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ తండాల నుంచి తరలివచ్చిన మథుర లంబాడీలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో ఫాగింగ్

ఎల్లారెడ్డి, ఆగస్టు 18: పట్టణంలోని రెండో వార్డులో దోమల మందును పిచికారీ చేయిస్తున్నారు. దోమలు వృద్ధి చెందాయని వార్డు సభ్యులు తెలుపడంతో కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరీ విద్యాసాగర్.. కమిషనర్‌తో మాట్లాడారు. వార్డులో ప్రత్యేకంగా ఫాగింగ్ చేయిస్తున్నారు. వారం రోజుల పాటు ఫాగింగ్ చేయించాలని, దోమలను పూర్తిగా నివారించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలోని రెండో వార్డులో ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

# నాడు కఠిన నిర్ణయాలు.. నేడు సంతోష సంబురాలు

- నాగిరెడ్డిపేటలో రోడ్డుకు ఇరువైపులా 50ఫీట్ల దూరంలో ఇండ్లు, దుకాణాలు
- 1981లోనే నిర్మాణాలు
- నేడు నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తున్నా.. ఒక్కరికి కూడా కలుగని నష్టం



గోపాల్‌పేటలో రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల దూరంలో నిర్మించుకున్న దుకాణాలు, ఇండ్లు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 18: నాడు రోడ్డుకు 50 ఫీట్ల దూరంలో దుకాణాలు, ఇండ్లను నిర్మించుకోవాలనే చెబితే ప్రజలు బాధపడ్డారు. నేడు నూతన రహదారి పనుల్లో నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో ఒక్క ఇంటికి కూడా నష్టం వాటిల్లడం లేదు. అప్పట్లో సర్పంచ్‌గా పని చేసిన విఠల్‌రెడ్డిగారి కిషన్‌రెడ్డి తీసుకున్న కఠిన నిర్ణయాలే ఇందుకు కారణమని గ్రామస్తులు గర్వంగా చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగిరెడ్డిపేట మండల కేంద్రం కాగా నాగిరెడ్డిపేట గ్రామంతోపాటు గోపాల్‌పేట, బంజర గ్రామాలు ఆమ్లెట్ విలేజ్‌లుగా ఉన్నాయి. అందులో గోపాల్‌పేట గ్రామం ప్రధాన రహదారిపై ఉంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలు ఇక్కడే ఉన్నాయి. గోపాల్‌పేట వ్యాపార కూడలిగా మారింది. కాగా నాగిరెడ్డిపేట మండలం మీదుగా బాలానగర్ నుంచి బోధన్ మీదుగా బాసర వరకు కొత్తగా నాలుగు వరుసల రహదారిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. హైవే పనులు ప్రారంభించేందుకు రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపులా 50 ఫీట్ల చొప్పున స్థలాన్ని సేకరిస్తున్నారు. కిలోమీటర్‌కు పైగా విస్తరించిన గోపాల్‌పేటలో ఒక్క ఇల్లు గానీ దుకాణం కానీ కూల్చివేతకు గురికావడం లేదు. కొన్ని ఇండ్లు, దుకాణాల ఎదుట ఉన్న మెట్లు మినహా ఎలాంటి నష్టం వాటిల్లడం లేదు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం గోపాల్‌పేటలో గజం స్థలం రూ.80వేల వరకు ధర పలుకుతున్నది. ఒక్క గజం కూడా నష్టపోవడం లేదని గ్రామస్తులు సంబురపడుతున్నారు. ఈ సందర్భంగా 1981 నుంచి 1991 వరకు రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గ్రామానికి సేవలను అందించిన కిషన్‌రెడ్డి నిర్ణయాలను వారు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాలే నేడు గోపాల్‌పేట గ్రామాన్ని చెక్కు చెదరకుండా ఉండేలా చేశాయని చెబుతున్నారు.

### ముందస్తు ఆలోచనలు ఉన్న వ్యక్తి..

మా నాన్న ముందస్తు ఆలోచనలు ఉన్న వ్యక్తి. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే అప్పట్లోనే కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. 1981లో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు మా గ్రామ ప్రజలకు వరంగా మారింది. అప్పట్లోనే లా చదివిన ఆయన.. మండల కేంద్రంలో 50 ఫీట్ల దూరంలోనే ఇండ్లు, దుకాణాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. చాలా మంది ఎదురు తిరిగినా.. తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. నేడు ఒకరికి కూడా నష్టం వాటిల్లకుండా నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కావడం చాలా సంతోషాన్ని ఇస్తున్నది.

*- విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచ్*

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-AII

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఎల్లారెడ్డిలో కుక్కల స్వైర విహారం



ఎల్లారెడ్డిలో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 18: ఎల్లారెడ్డి పట్టణంలో శునకాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. పట్టణంలోని పలు వార్డుల్లో పదుల సంఖ్యలో గుంపులుగా చేరుతున్న శునకాలు.. రోడ్లపై తిరుగుతూ పాదచారులపై పడి రక్కుతూ బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా గల్లీల్లో, రోడ్లపై తిరుగుతున్న కుక్కలను చూసి పిల్లలు, పెద్దలు నడవడానికి కూడా జంకుతున్నారు. ఇండ్ల ఎదుట ఆడుకుంటున్న పిల్లలను కుక్కలు మీదపడి రక్కుతుండడంతో వారు బయటికి రావడానికి భయపడుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా, కుక్కలను అరికట్టడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పట్టణ ప్రధాన సమస్యగా ఉన్న కుక్కల బెడదను అధికారులు నివారించాలని వారు కోరుతున్నారు.

# రాఖీ విక్రయ కేంద్రాల వద్ద సందడి

లింగంపేట/బిచ్కుంద, ఆగస్టు 18: లింగంపేట, బిచ్కుందలో ఏర్పాటు చేసిన రాఖీ విక్రయ కేంద్రాలు సందడిగా మారాయి. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండగను నిర్వహిస్తుంటారు. శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున ఈ పండుగను నిర్వహించడం అనవాయితీగా వస్తున్నది. సోమవారం నిర్వహించే రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా రాఖీల విక్రయ దుకాణాలు వెలిశారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రాఖీలు కొనుగోలు చేయడానికి మండల కేంద్రాలకు తరలివస్తున్నారు. దుకాణాల్లో అన్ని రకాల రాఖీలను అందుబాటులో ఉంచారు.



లింగంపేటలోని దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

## నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, ఆగస్టు 18: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తున్నదని ప్రాజెక్టు ఏఈఈ శివ ప్రసాద్ తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రం 750 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల (17.802టీఎంసీల)కు గాను ప్రస్తుతం 1390.33 అడుగుల (4.176టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.



నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు

## మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడిని తొలగించండి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 18: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తున్న రియాజ్‌ను తొలగించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ శ్రీలతకు ఆదివారం ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని, విద్యార్థులు ఇండ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. భోజనం ఇష్టం వచ్చినట్లు వండుతున్నాడని తెలిపారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అతడిని తొలగించి కొత్త వారికి ఏజెన్సీని అప్పగించాలని కోరారు. పాఠశాలలో నైట్ వాచ్‌మన్, వాటర్‌మన్‌గా అన్ని విధులు తానే నిర్వహిస్తున్నట్లు రియాజ్ జీతం తీసుకుంటున్నాడని ఆరోపించారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.